సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ గౌతమ్

బాలికల పాఠశాలల వద్ద ప్రత్యేక రక్షణ చర్యలు

- మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, సెప్టెంబర్ 2(నమస్తే తెలంగాణ): బాలికల రెసిడెన్షియల్ పాఠశాలల వద్ద పటిష్ట రక్షణకు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే గస్తీ కోసం అదనపు పోలీసులను కావాలని అడిగితే ఏర్పాటు చేస్తామని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో సోమవారం రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వహణపై సమావేశమయ్యారు. ఇందులో కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ, విద్యార్థులకు ఇంటి దగ్గర కంటే రెసిడెన్షియల్ పాఠశాలల్లోనే రక్షణ ఎక్కువగా ఉంటుందనే నమ్మకం కల్గించాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత పాఠశాల ప్రిన్సిపాళ్లదేనని చెప్పారు. పిల్లలకు అందించే ఆహారం మెనూ ప్రకారం, పరిశుభ్రంగా రుచికరంగా ఉండేలా చూడాలన్నారు.

పాఠశాలల సమగ్ర నివేదిక అందజేయండి

సిటీబ్యూరో: పాఠశాలల పనితీరుపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇకపై ప్రతి పది పాఠశాలల పనితీరు ఎలా ఉందో తెలుసుకునేందుకు ప్రత్యేక అధికారులను నియమించారు. పాఠశాలను సందర్శించి నివేదికలను సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం పాఠశాలల పరిస్థితిపై కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లోని అకాడమిక్ గైడెన్స్ రిజిస్టర్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రిజిస్టర్ అప్‌డేట్, ఎంఎన్‌ఓలు, కాంప్లెక్స్ హెచ్ ఎంలు అందులో సంతకం చేశారా.? లేదా? అని పరిశీలించాలని చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు.

వర్షం.. బండి చక్రం భద్రం.!

ప్రతి 5 వేల కిలోమీటర్లకు ఒకసారి వీల్ చెకప్

- వాహనదారులకు టైర్లపై అవగాహన తప్పనిసరి
- వానకాలంలో గ్రిప్‌లేని టైర్లతో ముప్పు
- ప్రతి 50 వేల కిలోమీటర్లకు కొత్త టైర్ అమర్చాల్సిందే
- నాణ్యతలేని టైర్లపై బబుల్స్ మాదిరిగా ఎయిర్‌జాం



సిటీబ్యూరో, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): వరుసగా కురుస్తున్న వర్షాలతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నారు. దీంతో వెనుకలా వచ్చే వాహనాలు సైతం ప్రమాదానికి గురవుతున్నాయి. కొన్ని ఘటనల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. వానకాలంలో డ్రైవింగ్ చేయడం, వాహన మెయింటెనెన్స్ చాలా కీలకమని మెకానికల్ ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. టైరులో గాలి ఎంత ఉండాలి? ఎయిర్ ప్రజర్ లోపం ఉంటే ఏమవుతుంది? టైర్ల నాణ్యత ఎలా తెలుసుకోవాలి? తదితర వాటిపై వాహనదారులకు తక్కువ అవగాహన ఉంటుంది. ఫలితంగా వాహనం కండిషన్ ఎలా ఉన్నప్పటికీ డ్రైవ్ చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో వాహన టైర్లు మంచి కండిషన్‌లో లేకపోతే చాలా ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

టైర్ల గ్రిప్ చెక్ చేసుకోవాలి

– నాయుడు, మారుతీ షోరూం

టైర్ల పనితీరు సరిగా లేకపోతే స్కిడ్ అయ్యే ప్రమాదం అధికంగా ఉంటుంది. సడెన్ బ్రేకులు వేసినా ప్రమాదమే. అందుకే టైర్ల పనితీరు బాగుండేలా చూసుకోవాలి. కారు మోడల్‌ను బట్టీ టైర్లు.. వాటి పరిమాణాన్ని బట్టీ ఎయిర్ ఫిలప్ చేయాల్సి ఉంటుంది. సాధారణంగా 32 పాయింట్లతో గాలి నింపుతే సరిపోతుంది. ఒక్కో వెహికిల్‌లో ఒకటి రెండు పాయింట్లు ఎక్కువ తక్కువ ఉంటాయి. కారును ఎక్కువగా వినియోగించని వాళ్లు కనీసం పది నుంచి 15 నిమిషాలు కారును స్టార్ట్ చేసి ఉంచాలి. దీనివల్ల టైర్లు డ్యామేజీ అవకుండా ఉంటాయి. కారు బ్రేకుల పనితీరు తగ్గితే వెంటనే మెకానిక్‌కు చూపించాలి. వర్షంకాలంలో బ్రేకులు త్వరగా క్షీణిస్తాయి.

చక్రాలు సాఫీగా తిరగాల్సిందే..!

- ఏ వాహనానికైనా చక్రాలు అత్యంత ముఖ్యం. బండి కండిషన్ ఎలా ఉన్నా కొంతదూరం డ్రైవ్ చేసుకుంటూ వెళ్లాలంటే టైర్లు ఉండాల్సిందే. అవే లేకుండా ఏమీ చేయలేం. అంతటి ప్రాధాన్యతగల చక్రాలపై వాహనదారులకు అవగాహన అత్యంత అవసరమని మెకానిక్ ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు.
- ముఖ్యంగా టైరు నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలి. చాలా మంది టైర్లు గ్రిప్‌ను కోల్పోతున్నా నిర్లక్ష్యంతో వాహనాన్ని అలాగే నడుపుతుంటారు. ఇది చాలా ప్రమాదకరం. ప్రమాదాలకు అధిక కారణం టైర్లు బాగులేకపోవడమే.
- కార్ల టైర్లల్లో సరిపడా గాలి ఉండేలా చూసుకోవాలి. టైరు పరిణామాన్ని బట్టీ గాలి నింపుతారు. 14 ఇంచుల టైరులో 29, 15 ఇంచుల టైరులో 30, 16, 36 ఎయిర్ పాయింట్లుతో గాలి ఫిల్ చేయించుకోవాలి.
- కారును ఎక్కువగా వినియోగించకపోతే టైర్లు హార్డుగా మారే ప్రమాదం ఉంది. ఆ సమయంలో అధిక వేగంతో ప్రయాణం చేసినప్పుడు టైరు కదలికల్లో మార్పు వస్తుంది. రోడ్డుపై మేకులు, బండలు ఉన్నప్పుడు లేదా బ్రేకులు వేయడానికి ప్రయత్నించిన సమయంలో ఒక్కసారిగా కారు టైరు బ్లాస్ట్ అయ్యే ప్రమాదం ఉంది.
- వాహనదారులు ఇష్టారీతిన డ్రైవ్ చేయడం కూడా ప్రమాదమే. ముఖ్యంగా సడెన్ బ్రేకులు ఎక్కువసార్లు వేయడం, స్పోర్ట్స్ వాహనాల మాదిరిగా వీల్స్ ను ఎక్కువ సార్లు అటు ఇటూ తిప్పడం కూడా టైర్ నాణ్యతపై ప్రభావం చూపుతుంది. నెమ్మదిగా టైర్ గ్రిప్స్ బలాన్ని కోల్పోతాయి.
- ప్రతి 5 వేల కిలో మీటర్లకు ఒక్కసారి తప్పనిసరిగా వీల్ బ్యాలెన్స్ చేక్ చేసుకోవాలి. టైర్లలో ఎయిర్ కండిషన్ చూసుకోవాలి.
- 40 వేల కిలో మీటర్లను పూర్తి చేసుకున్న కార్లు తప్పనిసరిగా కొత్త టైర్లను అమర్చుకోవాలి.
- టైర్లను కొనుగోలు చేసే సమయంలో నూతన తేదీల తయారీనే ఎంచుకోవాలి. ఉదాహరణకు 2019 మ్యానుఫక్చరింగ్ టైరును ఈ ఏడాదిలో కొనుగోలు చేయడం మంచిది కాదని ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. తక్కువ ధరకు వస్తుందని కాలపరిమితితో సంబంధం లేకుండా కొనుగోలు చేసి ప్రమాదాల బారిన పడుతున్నారు.
- టైరులో గాలి చెక్ చేసుకోవాలి. కారును ముందుకు వెనుక్కి తిప్పడం వలన టైరులోని గాలిని తెలుసుకునే వీలుంది. టైర్‌లో తక్కువ గాలి ఉంటే కారులోని ఇంజిన్‌పై ఒత్తిడి పడుతుంది. ఇది కారు మైలేజీ సమస్యలకు కారణమవుతుంది. టైర్లు త్వరగా అరిగిపోతాయి.
- హ్యాండ్ బ్రేక్‌ను తీసి ఉంచడం వల్ల కారు భూమిపై సరిగ్గా పొంది టైర్లు అనుకూలంగా ఉంటాయి. దీంతో టైర్లపై సమానంగా భారం పడుతుంది. లేదంటే టైర్లు హార్డ్‌గా మారతాయి.
- టైర్లు సక్రమంగా లేకపోయినా ఒక్కోసారి బ్రేకులు పడవు. అందుకే టైర్ల గ్రిప్‌లపై కూడా దృష్టి సారించాలి. టైరుపై 2 ఎంఎం ట్రేడ్ ఉండాలని మెకానిక్‌లు సూచిస్తున్నారు.

విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం

నేడు అగ్రి వర్సిటీ వార్షికోత్సవం

- ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాలే స్ఫూర్తి
- అనతి కాలంలోనే దేశ వ్యాప్త గుర్తింపు

వ్యవసాయ యూనివర్సిటీ, సెప్టెంబర్ 2: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనతి కాలంలోనే, అప్పటి సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వం రాష్ట్ర రైతాంగానికి అండగా నిలిచింది. ఎన్నడూ లేని విధంగా వరి ధాన్యం పెరగడంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతాంగానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా అండగా నిలిచింది. పరిశోధనా, విస్తరణ, విద్యా, విభాగాలలో విప్లవాత్మక మార్పునకు ఈ యూనివర్సిటీ నాందిగా నిల్చింది. యూనివర్సిటీ నేటి మంగళవారంతో 10 వసంతాలు పూర్తి చేసుకుంది. 2014 ఏర్పాటు నుంచి పీజేటీఎస్ఏయూ జాతీయ స్థాయిలో అనేక ఉన్నత శిఖరాన్ని అందుకుంది. వర్సిటీ రిజిస్ట్రార్ డా.రఘురామిరెడ్డి పదేళ్లలో ఐదు నూతన వ్యవసాయ కళాశాలలు, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల, నాలుగు వ్యవసాయ పాలిటెక్నికల్ కళాశాలల్ని ప్రారంభించింది. సీట్ల సంఖ్యను 1360కి పెంచారు. అమెరికాలోని అబర్న్ విశ్వవిద్యాలయంలో అగ్రికల్చర్ లోన్ పీజీ కోర్సు అభ్యశించేందుకు విద్యార్థులకు ఓవర్సీస్ ఫెలోషిప్ అందించామన్నారు. పీజేటీఎస్ఏయూ 37 స్థానాన్ని సాధించిందన్నారు. ప్రధాన పంటల్లో ఇప్పటి వరకు 67 నూతన వంగడాలను విడుదల చేశామన్నారు. జీజేటీఎస్ఏయూ రూపొందించిన తెలంగాణ సోన వరి వంగడానికి జాతీయ స్థాయలో బాగా ఆదరణ పొందింది. దేశంలోనే తొలిసారిగా డ్రోన్ అకాడమిని నెలకోల్పడంతో నేడు మారుమూల గ్రామాలలో సైతం డ్రోన్ ద్వారా పత్తి తదితర పంటలకు రసాయన ఎరువులు పిచికారి చేస్తున్నారు. ఇలా తెలంగాణ సాగులో అనేక మార్పులకు నిలయమైంది.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి : ఏసీపీ

సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రమేశ్‌కుమార్

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 2 : ఈ నెల 7నుంచి 17వరకు నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణలో జరుపుకోవాలని ఏసీపీ రమేశ్‌కుమార్ సూచించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం గణేశ్ ఉత్సవ కమిటీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులలో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. గణేశ్ మండపాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, సీసీ కెమెరాలను అమర్చుకోవాలని అన్నారు. నిమజ్జనం సందర్భంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పట్టణ సీఐ రమేశ్, ఎస్ఐ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలి

- జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఎల్.యశోద

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 2 : రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఎల్.యశోద సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. వర్షాల కారణంగా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉంటే దోమలు పుట్టే అవకాశం ఉంటుందని, వాటి వల్ల మలేరియా, చికున్ గున్యా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలున్నాయని తెలిపారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఆరుబయట, రోడ్లపై అమ్మే ఆహార పదార్థాలు తినడం వల్ల విరేచనాలు వచ్చే అవకాశాలుంటాయని తెలిపారు. ఇంటి వద్దే వేడి పదార్థాలు, కాచి చల్లార్చిన నీటిని ఉపయోగించి ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సాంఘిక సంక్షేమ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు పెట్టే ఆహార పదార్థాలు వేడిగా ఉండేలా చూడాలని, ఆహార పదార్థాలపై మూతలు ఉండేలా జగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. విద్యార్థులు బయటి పదార్థాలు తీసుకోకుండా చూడాలని, పిల్లలకు ఏదైనా ఆరోగ్య సమస్యలుంటే సంబంధిత వైద్యాధికారికి లేదా ఆశ కార్యకర్తలకు తెలియజేసి వైద్య సహాయం పొందాలని పేర్కొన్నారు. వైద్య సహాయం కోసం కలెక్టరేట్ ప్రాంగణంలోని ఆరోగ్యా శాఖాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 8125147540 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఫ్రైడే డ్రై డేను తప్పక పాటించి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకుని ఆరాగ్యాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు.

చౌటుప్పల్ మీదుగా సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్ ప్రయాణం

చౌటుప్పల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్

చౌటుప్పల్, సెప్టెంబర్ 2 : సీఎం రేవంత్‌రెడ్డి ఖమ్మం జిల్లా వరద ముంపు ప్రాంతాలను పరిశీలించేందుకు రోడ్డు మార్గం గుండా సోమవారం బయల్దేరారు. చౌటుప్పల్ మీదుగా వెళ్లిన ఆయన కాన్వాయ్‌కి పార్టీ శ్రేణులు, ప్రజలు స్వాగతం పలికారు. సీఎం ప్రయాణం సందర్భంగా పట్టణంలో కొద్దిసేపు ఇరువైపులా ట్రాఫిక్‌ను ఆపారు. దీంతో కిలోమీటర్ మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. అనంతరం పోలీసులు వాహనాలను వదిలి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అలుగు పోస్తున్న పోచంపల్లి పెద్ద చెరువు

మత్తడి దుంకుతున్న పోచంపల్లి పెద్ద చెరువు

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 2 : భారీ వర్షాలకు మూసీ నది పరవళ్లు తొక్కుతుంది. మూసీ వాగు నుంచి నీరు వచ్చి చేరడంతో పోచంపల్లి పెద్ద చెరువు పూర్తిగా నిండి మత్తడి దుంకుతుంది. దీంతో చెరువు ఆయకట్టు ప్రాంతాల్లోని వరి పొలాలకు నీరు ఉపయోగపడుతుంది.

అక్రమ కట్టడాలు చేపడితే చర్యలు తప్పవు : ఆర్డీఓ

దండు మల్కాపురంలో అక్రమంగా నిర్మించిన ప్రహరీని కూల్చివేయిస్తున్న అధికారులు

చౌటుప్పల్, సెప్టెంబర్ 2 : ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తప్పవని ఆర్డీఓ వి.శేఖర్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని దండుమల్కాపురం గ్రామంలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న ప్రహరీని రెవెన్యూ, పోలీసు అధికారులతో కలిసి సోమవారం కూల్చివేశారు. కార్యక్రమంలో ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, తాసీల్దార్ హరికృష్ణ, సీఐ మన్మథకుమార్ పాల్గొన్నారు.

హైజ్వరాబాద్

- డెంగీ, మలేరియా, చికున్ గున్యా రోగాల తాండవం
- జలుబు, దగ్గు, జ్వరం, ఒంటి నొప్పుల వైరల్ ఫీవర్స్
- కిక్కిరిసిపోతున్న దవాఖానలు

ఫీవర్ ఆస్పత్రిలో..

సిటీబ్యూరో, సెప్టెంబర్ 2(నమస్తే తెలంగాణ): మూడు రోజులుగా కురుస్తున్న వానలతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. దీంతో వైరల్ ఫీవర్స్ గ్రేటర్‌ను చుట్టుముట్టాయి. వర్షం కారణంగా దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా, చికున్ గున్యా వంటి విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. మరో పక్కన జలుబు, దగ్గు, జ్వరం, ఒంటి నొప్పుల వంటి లక్షణాలతో వైరల్ ఫీవర్స్ జనాలను వణికిస్తున్నాయి. ఏ ఇంట్లో చూసినా జ్వర పీడితులే కనిపిస్తున్నారు. నగరంలోని దవాఖానలన్నీ జ్వర పీడితులతో కిక్కిరిసిపోతున్నాయి. బస్తీ దవాఖానలు సైతం సీజనల్ బాధితులతో కిటకిటలాడుతున్నాయి. నల్లకుంట ఫీవర్ హాస్పిటల్‌లో రోజు వారి ఓపీ 800 నుంచి 1500 దాటుతున్నట్లు దవాఖాన వర్గాలు తెలిపాయి. ఉస్మానియా, గాంధీ దవాఖానల్లో సైతం రోజు వారి ఓపీ 3000 దాటుతున్నట్లు దవాఖాన వర్గాలు తెలిపాయి. ప్రధానంగా వైరల్ ఫీవర్స్, డెంగీ తదితర జ్వరాలకు సంబంధించిన జనరల్ మెడిసిన్ ఓపీ రోజువారి కంటే రెండు మూడు రెట్లు అధికంగా నమోదవుతున్నట్లు దవాఖానల అధికారులు చెబుతున్నారు. డెంగీ, మలేరియా, చికున్ గున్య వంటి విషజ్వరాల బాధితులను పక్కన పెడితే వైరల్ ఫీవర్స్ కేసులు రోజురోజుకు తీవ్రంగా పెరుగుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. వైరల్ ఫీవర్స్ ఒకరి నుంచి మరొక్కరికి సోకుతుండటంతో ఈ కేసుల సంఖ్య పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. ఇంట్లో ఒక్కరికి వస్తే చాలు, ఇతర కుటుంబ సభ్యులందరూ వైరల్ ఫీవర్స్ బారిన పడుతున్నారు. ముఖ్యంగా విద్యా సంస్థలు, కార్యాలయాలు, రద్దీ ప్రాంతాల్లో ఈ వైరల్ ఫీవర్స్ ఒకరి నుంచి మరొక్కరికి వ్యాపిస్తున్నట్లు వైద్య నిపుణులు తెలిపారు. దీంతో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో కూడా రోజు వారి ఓపీ 500 దాటుతోందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పలు దవాఖానల్లో వైద్య సిబ్బంది సైతం వైరల్ ఫీవర్స్‌కు గురవుతున్నట్లు వైద్యులు తెలిపారు. కాగా, వైరల్ ఫీవర్స్ గురించి పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సింప్టమ్యాటిక్ ట్రీట్‌మెంట్ తీసుకుంటే సరిపోతుందంటున్నారు వైద్యులు. మూడు నుంచి ఐదు రోజుల్లో వైరల్ ఫీవర్స్ తగ్గిపోతాయని, అప్పటికీ తగ్గకపోతే తదుపరి వైద్య పరీక్షలు చేయించుకుని అవసరమైన చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు. డెంగీ, మలేరియా వంటి విష జ్వరాల పట్ల ప్రజలు నిర్లక్ష్యం చేయకూడదని, సకాలంలో చికిత్స తీసుకుంటే మంచిదని సూచిసున్నారు.

రేపు మోత్కూరులో రక్తదాన శిబిరం

మోత్కూరు, సెప్టెంబర్ 2 : ఇండియన్ రెడ్‌క్రాస్, టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం మోత్కూరులో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. పట్టణంలో సోమవారం రక్తదాన శిబిరం ప్రచార పత్రాలను అవిష్కరించి మాట్లాడారు. ఆపదలో ఉన్న వారి కోసం రక్తం దానం చేయడం కోసం నేటి యువత ముందుకు రావాలన్నారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఉదయం ఏర్పాటు చేయనున్న రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రారంభిస్తారని తెలిపారు. మున్సిపల్, మండల పరిసర గ్రామాల యువకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.ఉప్పలయ్య, వెంకన్న, సుబ్రమణ్యం, సత్తయ్య, మనోహరాచారి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ట్రావెల్ బస్సు డ్రైవర్ మృతి

చౌటుప్పల్, సెప్టెంబర్ 2 : మండలంలోని ధర్మోజిగూడెంలో 65వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కావేరి ట్రావెల్ బస్సు డ్రైవర్ మృతిచెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒంగోలు జిల్లా అప్పలకుంటకు చెందిన చెంచు రామయ్య (35) ట్రావెల్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఒంగోలు నుంచి హైదరాబాద్‌కు ప్రయాణికులతో బయల్దేరిన బస్సు ధర్మోజిగూడెం వద్ద ముందున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ రామయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సీఐ మన్మథకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

12 గ్యాస్ సిలిండర్లు పట్టివేత

చౌటుప్పల్, సెప్టెంబర్ 2 : పట్టణంలోని తంగడపల్లి రోడ్డు సమీపంలో ఓ ఇంట్లో సోమవారం అక్రమంగా నిల్వ చేసిన గ్యాస్ సిలిండర్లను ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన 12 సిలిండర్లను స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేశారు.

ముళ్ల కంపల్లో పురిటి శిశువు

- గుర్తించిన స్థానికులు
- సీహెచ్‌సీకి తరలింపు
- శిశువు క్షేమం
- తల్లిదండ్రుల గుర్తింపు

మేడ్చల్, సెప్టెంబర్ 2: హాయిగా తల్లి పొత్తిళ్లలో భరోసాతో నిద్ర పోవాల్సిన పురిటి శిశువు బొడు ఊడకుండానే ముళ్ల కంప పాలైంది. ఆడ పిల్ల పుట్టిందనో, సాకలేమన్న ఆర్థిక పరిస్థితితో తెలియదు. కాని, తొమ్మిది నెలలు మోసిన బిడ్డను తల్లి కొన్ని క్షణాల్లోనే నిర్దయగా పాలీథిన్ కవర్‌లో చుట్టి, ముళ్ల కంపల్లో పడేసింది. వెంటనే గుర్తించిన స్థానికులు చేరదీసి, ఆస్పత్రికి తరలించడంతో పురిట్లోనే పందులు, కుక్కలు లేదా విష పురుగుల బారినపడి మృతి చెందాల్సిన శిశువు లోకాన్ని చూడగల్గింది. ఈ దారుణ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌడవెల్లి గ్రామంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం, సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో గౌడవెల్లి గ్రామ పరిధిలో రైల్వేగేట్ అవల ఉన్న ముళ్ల పొదల్లో శిశువు అరుపులు వినిపించగా, అటుగా వచ్చిన ఆటో డ్రైవర్ గుర్తించాడు. లోపలికి వెళ్లి చూడా బొడ్డు కూడ ఊడని ఆడ శిశువు పాలిథిన్ కవర్‌లో చుట్టి పడేసేసినట్టు గుర్తించాడు. వెంటనే పక్కనే హోటల్‌ను నిర్వహిస్తున్న లక్ష్మి చెప్పాడు. వారు గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇచ్చారు. ఆయన ఆశా కార్యకర్త, ఏఎన్ఎంకు తీసుకొని హుటాహుటీనా ఘటనా స్థలికి వెళ్లాడు. అందరూ కలిసి ఆ శిశువును ముళ్ల పొదల్లో నుంచి జాగ్రత్తగా బయటకు తీశారు. గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో శిశువు తల, చెక్కిళ్లకు అంటుకున్న చీమలను తొలగించడంతో ప్రథమ చికిత్స అందించి, మేడ్చల్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోలీసులతో పాటు సీడీపీవోకు సమాచారం అందించారు. సీడీపీవో శారద శిశువును ఆరోగ్య కేంద్రానికి తరలించే లోపే అక్కడికి పోలీసులు చేరుకున్నారు. వైద్యులు పాపకు తగిన వైద్యం అందించారు.

తల్లిదండ్రుల గుర్తింపు

ముళ్ల పొదల్లో పురిటి శిశువును పడవేసిన ఘటనపై ఆరా తీయగా, పలువురు స్థానికేతరులు కోళ్ల ఫారంలో కార్మికులుగా పని చేసే తులసి(18), సంతోష్(17) గురించి పోలీసులకు సమాచారం అందించారు. వారిని పిలిపించి గట్టిగా మందలించడంతో తమ శిశువు అని ఒప్పుకున్నారు. నివాసం ఉన్న చోటనే ప్రసవించిన తులసి కొద్ది క్షణాల్లోనే ముళ్ల పొదల్లో పడవేసినట్టు స్థానికులు, పోలీసులు గుర్తించారు. సంతోష్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించగా, తులసిని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. తులసి బిడ్డకు పాలిచ్చేలా చర్యలు తీసుకున్నారు.

రేగులకుంటలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఆత్మకూరు(ఎం), సెప్టెంబర్ 2 : మండలంలోని రేగులకుంటలో 2నెలల నుంచి లోవోల్టేజీ సమస్యతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సమస్యను ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్ దృష్టికి గ్రామ ప్రజలు తీసుకుపోవడంతో స్పందించిన ఆయన సోమవారం 15కేవీ సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. గతంలో 12కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో లోవోల్టేజీ సమస్య ఉండేదని, ఇప్పుడు 15కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారం అయిందని గ్రామస్తులు తెలిపారు.

పాడి రైతులకు బిల్లులు చెల్లించాలి : సీపీఐ

రాజాపేట, సెప్టెంబర్ 2 : మదర్ డెయిరీ పాడి రైతులకు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులు వెంటనే చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి చిగుళ్ల లింగం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాల బిల్లులు చెల్లించక పోవడంతో పాడి రైతులు ఆందోళనకు గురవుతూ ప్రైవేటు డెయిరీలను ఆశ్రయిస్తున్నారన్నారు. బేగంపేట వెటర్నరీ దవాఖానలో వైద్యుడిని ఏర్పాటు చేయాలని కోరారు.

ఆత్మకూర్ (ఎం) మండలంలో ముసురు

ఆత్మకూరు (ఎం), సెప్టెంబర్ 2 : మండల వ్యాప్తంగా 3వ రోజు సోమవారం ముసురు పెట్టింది. మండల కేంద్రంలోని బిక్కేరు వాగుపై నిర్మించిన చెక్ డ్యాంలోకి వరద నీరు వచ్చి చేరుతుంది. ఆర్ఐ మల్లికార్జున్‌రావు మొరిపిరాల బిక్కేరు వాగును, ఆత్మకూరు(ఎం)లోని చెక్‌డ్యాం లోకి వస్తున్న వరద నీటిని పరిశీలించారు.

కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జి జిష్ణుదేవ్ వర్మ, వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ ఎం.విజ్జులత తదితరులు

పోషకాహారంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- మహిళా వర్సిటీలో పోషకాహారంపై ఐదు రోజుల ప్రదర్శన ప్రారంభం

సుల్తాన్ బజార్, సెప్టెంబర్ 2: పోషక ఆహార పదార్థాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యా సంస్థలు, విద్యార్థులపై ఉందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. కోఠిలోని తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో 'ప్రతి ఒక్కరికి